క్లుప్తంగా

పాఠశాలల పని వేళల మార్పు

చాగల్లు: రాష్ట్రంలో రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల సమయాలను మార్పు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈవో సుభాకర్ అన్నారు. దానిలో భాగంగా బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైందని అన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలో తరగతులు నిర్వహిస్తారని తెలిపారు.

ఉపాధి హామీ పథకం మండల టెక్నికల్ అసిస్టెంట్‌గా కాంతారావు

ఉండ్రాజవరం: జాతీయ ఉపాధి హామీ పథకం ఉండ్రాజవరం మండల సాంకేతిక సహాయకుడిగా గొల్లపల్లి కాంతారావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు పని చేసిన ఎం.శ్రీనివాసు సీతానగరం బదిలీపై వెళ్లారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

నిడదవోలు రూరల్: కాటకోటేశ్వరం, పురుషోత్తపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని ఉనకరమిల్లి, పందలపర్రు, జీడిగుంట, డి.ముప్పవరం, కలవచర్ల గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్నాయి. దీని కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.నారాయణ అప్పారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

దేవరపల్లి: స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో దేవరపల్లిలో నూతనంగా 11 కేవీ రెండో టౌన్‌ఫీడర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటన్నర వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ తెలిపారు. ఇండస్ట్రియల్ ఫీడర్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఉండ్రాజవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఆన్‌లైన్ ఉద్యోగాలు, చీటింగ్, థర్డ్ పార్టీ కాల్స్, ఫేక్ ఎస్ఎంఎస్‌లు వస్తే నమ్మొద్దని ఎస్సై గుబ్బల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ భవనంలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి అవసరం వచ్చిన సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కి కాల్ చేసి, పోలీస్ సహాయం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ నిధి మేనేజర్ ఎం.రత్నకుమారి, ఏజీఎం ఎం.ధర్మేంద్ర, ఏపీఎం టి.బాలకోటయ్య, ఎస్‌బీఐ మండల మేనేజర్ ఎన్.హరిగోవింద్, ఏఎస్సై కె.రామకృష్ణ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మద్యం లైసెన్స్‌దారులకు 20శాతం కమిషన్ ఇవ్వాలి

కొవ్వూరు: గెజిట్‌లో పొందుపరిచిన విధంగా మద్యం షాపుల లైసెన్సుదారులకు ఇరవై శాతం కమిషన్ అందించాలని మద్యం షాపుల లైసెన్స్‌దారుల రాష్ట్ర అసోసియేషన్ నాయకులు గురువారం అమరావతిలో ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రని కోరారు. టెండర్ల సమయంలో ఇరవై శాతం కమిషన్ ఇస్తామని గెజిట్‌లో ప్రకటించి ఇప్పుడు పదిశాతం కమిషన్ మాత్రమే ఇస్తామనడం దారుణమని, 20 శాతం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 3,300 మద్యం దుకాణాలకు గాను 90వేల దరఖాస్తులొచ్చాయని, ఒక్కో షాపుకి సరాసరి రూ.60 లక్షలు చొప్పున ఖర్చు చేసినట్లయ్యిందన్నారు. మద్యం లైసెన్స్‌దారులకు కేవలం పదిశాతం కమిషన్ చెల్లించడం వల్ల గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు రెండో విడత పన్నులు మొదటి నెలలో కట్టించు కుంటున్నారని, గతంలో పన్ను చెల్లించడంలో ఆలస్య అయితే వడ్డీ కట్టించుకునే వారని ప్రస్తుతం ఫెనాల్టీ కుడా కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 25వ తేదీన విజయవాడలో రాష్ట్ర మద్యం లైసెన్సుదారుల సమావేశం నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

ఉండ్రాజవరం: ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఇనుప నిచ్చెన తీసుకెళుతుండగా ఆ నిచ్చెనకు 11కేవీ విద్యుత్ వైర్ తగలడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిగా మరో వ్యక్తికి స్వల్ప గాయాలైన సంఘటన కె.సావరంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కె.సావరం గ్రామంలో మాదాసు నాగేంద్ర(35) తణుకు ప్రైవేట్ ఆసుపత్రిలో పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కె.సావరం టీచర్స్ కాలనీలోని ఇంటి వద్ద నుంచి ఇనుప నిచ్చెనను తణుకులోని తాను పని చేస్తున్న ఆసుపత్రికి ద్విచక్ర వాహనంపై తీసుకు వెళుతూ మార్గ మధ్యలో బరువెక్కడంతో వాహనంపై నుంచి దిగి భుజం మార్చుకునే సమయంలో 11కేవీ వైరు నిచ్చెన తాకడంతో విద్యుత్ షాక్ తగిలి నాగేంద్రం సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ముందున్న వ్యక్తి నెక్కంటి పవన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. నాగేంద్రకు ఇటీవలే వివాహం జరిగింది. అతనికి భార్య, ఒక సంవత్సరంన్నర పాప ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై గుబ్బల శ్రీనివాసు తెలిపారు.

కోరుపల్లిలో ఫీవర్ సర్వే

నిడదవోలు రూరల్: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ఫీవర్ సర్వే నిర్వహించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్టు జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. కోరుపల్లి గ్రామంలో జరిగిన ఫీవర్ సర్వేను గురువారం ఆయన పరిశీలించారు.

టైపు మెషీన్లకు ఇక సెలవు

- మూలకు చేరిన టైపు రైటింగ్ మెషీన్లు
- కంప్యూటర్ల రాకతో తగ్గిన ప్రాధాన్యత
- అక్కడక్కడ కొనసాగుతున్న టైపు ఇన్‌స్టిట్యూట్‌లు



నల్లజర్లలో టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థినులు

నల్లజర్ల: టకటక శబ్దంతో ఎంతో మందికి ఉపాధి కల్పించే టైపు రైటింగ్ మెషీన్లు ప్రస్తుతం కనుమరుగుతున్నాయి. నిన్న మొన్నటి వరకూ కూడా విద్యార్థులు టైపును నేర్చుకునేవారు. కంప్యూటర్ రావడంతో టైపు మెషీన్లను మూలనకు చేరాయి. ఇప్పుడు ఎక్కడో ఒకటో రెండో ప్రభుత్వ కార్యాలయాల్లో ఉండేవి. అయితే 2024-25 సంవత్సరం తర్వాత టైపు ఇన్‌స్టిట్యూట్‌ల రెన్యూవల్ నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అంతంత మాత్రంగా ఉన్న టైప్ ఇనిస్టిట్యూట్‌ల శకం దాదాపు ముగిసినట్టే. బ్యాచ్‌ల వారీగా కీబోర్డు మీటలు నొక్కే చేతులు ఇప్పుడు కరువయ్యాయి. నల్లజర్ల మండల కేంద్రంలో ఉన్న ఒకే ఒక్క టైప్ ఇన్‌స్టిట్యూట్ గతంలో విద్యార్థులతో కళకళలాడేది. ఇది 1990 సంవత్సరం మాట. 12 మెషీన్లతో సంవత్సరానికి హయ్యర్, లోయర్ పరీక్షలకు దాదాపు 14 బ్యాచ్‌లను పరీక్షలకు పంపేవారమని ఇప్పుడు నిస్తేజమైందని ప్రతిభ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపాల్ కోమటి నాగ సత్యనారాయణ చెబుతున్నారు. కంపెనీలు సైతం మెషీన్ల తయారీని నిలిపివేశాయన్నారు. తమ వద్ద ఉన్న రెండు మెషీన్లపై నలుగురు విద్యార్థులు మాత్రమే టైపు నేర్చుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నేర్చుకునే వారు లేక జిరాక్స్ మెషీన్లు, స్పైరల్ బైండింగ్‌లు, జాబ్ వర్క్‌తో ఉపాధి పొందుతున్నట్టు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో పది వేలకు పైగా ఉండే టైప్ ఇన్‌స్టిట్యూట్లు ప్రస్తుతం 450కి చేరాయి.

కంప్యూటర్లు రావడంతో..

ఒకప్పుడు పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు మరుసటి రోజు నుంచే టైపు నేర్చుకునేందుకు వెళ్లేవారు. వేసవిసెలవుల్లో టైపు ఇన్‌స్టిట్యూట్‌లు కళకళలాడేవి. టకటకలతో లయబద్ధంగా శబ్దం వినిపించేది. ఆంధ్రప్రదేశ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు ఏడాదికి రెండు సార్లు నిర్వహించే టైప్‌రైటింగ్ పరీక్షలకు వందలాదిగా విద్యార్థులు హాజరయ్యేవారు. ఇంటర్ పూర్తయ్యే నాటికి టైపు హయ్యర్, లోయర్ పూర్తి చేసేవారు. దీంతో పాటు షార్ట్‌హ్యాండ్ నేర్చుకొని ఆ పరీక్షలకు వెళుతుండేవారు. టైపు మెషీన్ల కాలమంతా ఒక స్వర్ణయుగంలా ఉండేది. యంత్రాలు వచ్చి కూలీలకు కష్టం తెచ్చినట్టే కంప్యూటర్ల రాకతో టైపు మెషీన్లకు ప్రాధాన్యత తగ్గిపోయింది. కార్పొరేట్ చదువులు అక్కడిచ్చే కోచింగ్‌లతో టైపునకు వెళ్లేంత సమయం విద్యార్థులకు ఉండడం లేదు. దీంతో టైపు ఇన్‌స్టిట్యూట్‌లకు గడ్డుకాలం దాపురించింది.



టైప్ మెషీన్

గతంలో తెలుగు, హిందీతో పాటు ఇంగ్లీషు టైప్ రైటింగ్ నేర్చుకునే వారు. కంప్యూటర్లలో ఇంగ్లిష్ కీబోర్డు దాదాపు ఒకేలా ఉండగా తెలుగు, హిందీ భాషలకు కీబోర్డులో మార్పులు వచ్చాయి. దీంతో అక్కడక్కడ ఇంగ్లిష్ టైప్‌నకు మాత్రమే వెళుతున్నారు. తెలుగు, హిందీ టైపు పరీక్షలకు హాజరయ్యే వారే లేకుండా పోయారు. మెషీన్ల రిపేర్లు చేయడానికి మెకానిక్‌లు కూడా కరువయ్యారు. దీంతో మెషీన్లు ఉంచేందుకు కూడా వెనుకడుగు వేస్తున్నారు.

34 ఏళ్లుగా టైపు శిక్షణ



నల్లజర్లలో 1990లో ప్రతిభ టైప్ ఇనిస్టిట్యూట్ స్థాపించాను. ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు బ్యాచ్‌ల వారీగా విద్యార్థులు వచ్చి నేర్చుకునేవారు. ఏటా లోయర్, హయ్యర్ పరీక్షలకు ఎన్నో బ్యాచ్‌లను పంపేవాడిని. నాలుగు రోజులు పరీక్షలు జరిగేవి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ ఇనిస్టిట్యూటే జీవనాధారం. తెలిసిన విద్య వదులుకోలేక ప్రత్యామ్నాయం లేక స్పైరల్ బైండింగ్, జిరాక్స్, జాబ్ వర్క్ చేస్తూ ఇంటిని నడుపుతున్నాను.

– కోమటి నాగ సత్యనారాయణ, ప్రిన్సిపాల్, ప్రతిభ టైప్ ఇన్‌స్టిట్యూట్, నల్లజర్ల

నాన్నకు ప్రేమతో...

- దాత గంగరాజు దాతృత్వం
- గోపాలపురంలో రూ.5లక్షలతో అభివృద్ధి పనులు



గోపాలపురంలో ఎస్సీ బీసీ, మైనార్టీ వర్గాల శ్మశాన వాటిక వద్ద బోరు వేయిస్తున్న దాత గంగరాజు

గోపాలపురం: గ్రామానికి చెందిన దాత మద్దిపాటి గంగరాజు గ్రామంలో ప్రజలు ఇబ్బంది పడుతున్న సమస్యలపై దృష్టిసారించారు. సుమారు రూ.5 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గురువారం ఎస్సీ, బీసీ, మైనార్టీల శ్మశాన వాటిక వద్ద తాగునీరు సౌకర్యార్థం రూ.50వేలతో మంచినీటి బోరును వేయించారు. మాజీ సొసైటీ అధ్యక్షుడు స్వర్గీయ మద్దిపాటి సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం కుమారుడు గంగరాజు గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. గ్రామంలోని టాక్సీ స్టాండు వద్ద షెల్టర్, గంగానమ్మ గుడి అభివృద్ధి పనులు, గోపాలపురంలోని మూడు బస్‌షెల్టర్ల వద్ద మహిళలకు అనుకూలంగా ఉండే టాయిలెట్లు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలకు విద్యుత్ పోయిన సమయంలో ఇన్వెంటర్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. గంగరాజును గ్రామ పెద్దలు, స్థానికులు అభినందించారు.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ తప్పనిసరి



అనంతపల్లి పోస్టాఫీసులో ఖాతాలు తెరుస్తున్న మహిళలు

నల్లజర్ల: దేశవ్యాప్తంగా ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు రాయితీలు ప్రకటిస్తున్నాయి. రాయితీ నగదును బ్యాంకు ఖాతాలకు జమ చేసే అవకాశం నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఇండియా(ఎన్‌పీసీఐ) చూసుకుంటోంది. దేశవ్యాప్తంగా ప్రజలందరీ బ్యాంకు ఖాతా నంబర్లు తీసుకోవడం కష్టం కనుక ఎన్‌పీసీఐ ఆధార్ నంబరుతో వారి ఖాతాలకు డబ్బులు జమ చేస్తుందని ఎంపీడీఓ సింహాద్రి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నగదు రాయితీలు నేరుగా వారి ఖాతాలకు జమ అవుతుంటే ఆధార్ అనుసంధానం లేని ఖాతాలకు డబ్బులు జమకావడం లేదని ఈ సమస్యను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీల పరిధిలో ఎవరి బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం కాలేదో ఆ జాబితాలను గ్రామ సచివాలయాలకు పంపించినట్టు ఆయన తెలిపారు. బ్యాంకులు రద్దీగా ఉండడంతో చాలా మంది పోస్టాఫీసులలో రూ.200లతో నూతన ఖాతాలు ప్రారంభిస్తున్నట్టు ఆయన చెప్పారు. మండలంలో 9,775 ఖాతాలకు ఆధార్ లింక్ లేనట్టు గుర్తించి సచివాలయ సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి సమస్య వివరించి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచిస్తున్నట్టు చెప్పారు. ఇంత వరకు 1673 ఖాతాలకు ఆధార్ లింక్ చేయించినట్టు చెప్పారు. ఈ నెల 25వ తేదీలోగా అందరూ ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

ఉండ్రాజవరం: గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో ప్రజలందరూ తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపీడీవో వి.రామారావు అన్నారు. మండలంలో దమ్మెన్ను సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంపును గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది ఆధార్ అప్డేట్ చేయించుకున్నట్లు ఆధార్ క్యాంప్ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గురజర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే కాలువ గట్లు కొల్లగొట్టేస్తున్నారు

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఆరోపణ



మారెళ్లమూడిలో పోలవరం కాలువ గట్టు నుంచి టిప్పర్లలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్

నల్లజర్ల: టీడీపీ, జనసేన నాయకులు మండలంలో పోలవరం కాలువ గట్లను పట్టపగలే తవ్వేసి డెల్టా గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నారని సింగరాజుపాలెం ఎంపీటీసీ వామిశెట్టి పావనీకుమారి పరమేశ్వరావు ఆరోపించారు. గురువారం ఆ గ్రామం నుంచి వెళ్తున్న రెండు టిప్పర్లను ఆమె అడ్డుకున్నారు. గ్రావెల్ తరలింపునకు అనుమతులు చూపాలంటూ ప్రశ్నించారు. ఇళ్ల వద్ద మెరక చేసుకోవడానికి తీసుకెళ్తున్నామని డ్రైవర్లు అబద్ధాలు చెప్పి తప్పించుకున్నారు. దీనిపై సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎక్కడా అడ్డగించడం గాని, కేసులు నమోదు చేయడం గాని చేయడం లేదని ఆమె ఆరోపించారు. పట్టపగలే గ్రావెల్ టిప్పర్లు అతివేగంగా వెళ్లడంతో అటుగా వెళ్తున్న పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆ పార్టీల అధినేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌ల చెప్పేదొకటి క్షేత్ర స్థాయిలో వారి నాయకులు, కార్యకర్తలు అక్రమాలకు తెసి బాహటంగా మట్టి, ఇసుక అక్రమరవాణాలతో పాటు ఊరూర బెల్ట్ షాపులతో దందా సాగిస్తున్నారన్నారు. పోలవరం కాలువ గట్లు అక్రమ తవ్వకంపై అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

పశు సంపద సంరక్షణ అందరి బాధ్యత

ఉండ్రాజవరం: పశు సంపదను కాపాడుకోవలసిన బాధ్యత రైతులదే కాదు అందరిది అని ఏపీ పశు గణాభివృద్ధి సంస్థ పెంటపాడు, ఈవో, డీఎల్‌డీఏ డాక్టర్ ఏసురత్నం అన్నారు. రాష్ట్రీయ గోకుల్‌మిషన్‌లో భాగంగా ఉండ్రాజవరం పశువైద్య కేంద్రంలో గురువారం పశువుల గర్భకోశ వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశువుల గర్భకోశ వ్యాధుల చికిత్సతోపాటు అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాడి పశువులు, పెయ్య దూడల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. సుమారు 70 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్టు మండల పశువైద్యాధికారి పి.శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఉండ్రాజవరం, దమ్మెన్ను సర్పంచులు మెండే వెంకట్రావు, గురజర్ల సత్యనారాయణ, యానిమల్ హస్బెండరీ కొవ్వూరు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుంకవల్లి సత్యనారాయణ, డాక్టర్ రుషి ప్రసాద్, ఎం.మోహన్‌రావు, ఎం.రాజేష్, డాక్టర్ సల్మా, పి.వనిత పాల్గొన్నారు.

స్కూలు బస్సు అద్దాలు పగులగొట్టిన ఆకతాయిలు



స్కూల్ బస్సు అద్దాలను ధ్వంసం చేసిన యువకులు

నల్లజర్ల: ఓ ప్రైవేటు విద్యా సంస్థకు చెందిన స్కూలు బస్సు తాడేపల్లిగూడెం నుంచి విద్యార్థులను దించడానికి ఆవపాడు వెళ్తుండగా ప్రకాశరావుపాలెం వద్ద బస్సు డ్రైవరుతో వాగ్వివాదానికి దిగిన కొంత మంది ఆకతాయిలు బస్సు అద్దాలు ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. గురువారం రాత్రి 7 గంటల సమయంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఆవపాడుకు చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై వెళ్తుండుగా వారి తాళం చెవి పడిపోవడంతో చీకట్లో వెతుక్కుంటున్నారు. అదే సమయంలో స్కూలు బస్సు అటుగా రావడం వారు అడ్డు తప్పుకోకపోవడంతో డ్రైవర్ హారన్ కొట్టాడు. దీంతో యువకులు కోపంతో డ్రైవర్‌తో వాగ్వివాదానికి దిగారు. మాట, మాట పెరిగి బస్సులు అద్దాలను ధ్వంసం చేసి పరారయ్యారు. స్కూలు యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సోమరాజు సంఘటన స్థలానికి వచ్చి విచారణ చేశారు.

పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

ఆ బస్సుల ద్వారా రూ.7,48,106 లక్షల ఆదాయం

కొవ్వూరు: కార్తిక మాసం సందర్భంగా కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి కొత్తగా ప్రారంభించిన అష్టసోమేశ్వరాలు, శివ కేశవ దర్శిని(కుండలేశ్వరం) యాత్రలకు మంచి ఆదరణ లభిస్తుందని డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. పంచారామాలు, ఏక దశ రుద్రులు, ద్వారకా తిరుమల,న వ జనర్దాన పారిజాతాలు వంటి పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపు తున్నామన్నారు. విశాఖపట్నం విహార యాత్రకు నడుపుతున్న ప్రత్యేక బస్సులకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. ప్రజల నుంచి విశేష ఆదారణ లభించడంతో రూ.7,48,106 ఆదాయం సమకూరినట్టు ఆయన తెలిపారు. అన్నీ రూట్లు కలిపి 36 ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. వీటి ద్వారా ఇంత వరకు 1,777 మంది ప్రయాణికులు ప్రయాణి ంచారన్నారు. కార్తిక మాసం చివరి సోమవారం కుడా ప్రత్యేక బస్సులన్నీ నడుతామని ఆయన స్పష్టం చేశారు. అంతే కాకుండా కాశీ, రామేశ్వరం, అరుణాచలం, షిర్డీ వంటి పుణ్య క్షేత్రాలకు సైతం బస్సులు నడుపుతామన్నారు. క్రైస్తవుల కోసం నాగపట్నం, ముస్లిం కోసం అజ్మీర్ వంటి పుణ్య క్షేత్రాలకు సైతం ప్రత్యేక బస్సులు పంపిస్తామన్నారు. అరకు, పాడేరు, మన్యసీమ దర్శిని వంటి విహార యాత్రలకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తామని తెలిపారు. కావున ప్రయాణీలంతా ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగ పరుచుకోవాలని ఆయన కోరారు.

ఘనంగా వరల్డ్ టెలివిజన్ డే



సమావేశానికి హాజరైన టీవీ టెక్నీషియన్లు

నిడదవోలు : పట్టణంలో ఎలక్ట్రానిక్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో గురువారం వరల్డ్ టెలివిజన్ డేను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక చర్ల సుశీల వృద్ధాశ్రమంలో దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన టీవీ టెక్నీషియన్ల సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సభ్యులు పామర్తి సత్యనారాయణ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పాలకులు ఎలక్ట్రానిక్ టెక్నీషియన్ల సంక్షేమాన్ని విస్మరించారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా ఏ ఒక్క సంక్షేమ పథకం ద్వారా టెక్నీషియన్లను ఆదుకోలేదన్నారు. కనీసం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లలో తక్కువ అద్దెకు దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. టీవీ టెక్నీషియన్లను అసంఘటిత కార్మికులుగా గుర్తించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సీనియర్ టెక్నీషియన్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు మల్లిడి వెంకటరామిరెడ్డి, మహమ్మద్ అలి, కోడాటి శ్రీనివాస్, వెలిగట్ల శ్రీనివాస్, ఎస్‌కే వలి, కిల్లాని గోపాల్, పుల్లారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోమెటిక్ వెదర్ స్టేషన్ పరిశీలన

తాళ్లపూడి(కొవ్వూరు): ప్రతి సంవత్సరం జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నమోదైన వర్షాన్ని, ఉష్ణోగ్రత, గాలి తీవ్రతను లెక్కించే మిషన్లను వాతావరణ శాఖ ఇంజినీర్ పలివెల అర్జున్ గురువారం పరిశీలించారు. తాళ్లపూడి మండలం పైడిమెట్ట ఎత్తిపోతల పథకం పంపు హౌస్‌పై ఏర్పాటు చేసిన రివర్ రైన్ గేజ్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్‌లో ఉన్న రైన్ గేజ్‌లను ఆయన పరిశీలించారు. మండలంలో మూడు ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌లున్నాయని ఏఎస్‌వో జోడాల వెంకట్ తెలిపారు. ప్రతి సీజన్‌లోను వీటిని తనిఖీ చేస్తున్నామని అన్నారు. ఈ మూడు స్టేషన్ల ద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం సేకరిస్తుందన్నారు. ఎలక్ట్రికల్ ఇంజినీర్ జి.శ్రీనివాసరావు, గన్నిన సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులతో ప్రిన్సిపాల్, పాఠశాల సిబ్బంది

గోపాలపురం: జోనల్ స్థాయి క్రీడల్లో ఓవరాల్ చాంపియన్‌గా గోపాలపురం బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికలు విశేష ప్రతిభ కనబరిచినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ పశ్చిమ గోదావరి జిల్లా పోలసానిపల్లె గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్ షిప్‌లో 40 మంది విద్యార్థులు పాల్గొని విజయ పతాకం ఎగురవేసినట్టు ఆమె తెలిపారు. కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్ తదితర విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు చెప్పారు. క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చిన పీఈటీ శిరీష, పీటీ గౌతమిలను ప్రిన్సిపాల్ సిబ్బంది అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

చాగల్లు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో ఎ.శ్రీదేవి అన్నారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మండలంలో ఊనగట్ల, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో హ్యాండ్‌వాష్, పరిసరాల పరిశుభ్రంతపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఎప్పటికప్పుడు హ్యాండ్ వాష్ చేసుకోవడం వల్ల వ్యాధులు బారిన పడకుండా ఉంటారని అన్నారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



గోపాలపురం కల్యాణ మండపంలో జాతీయ గీతం ఆలపిస్తున్న ఎస్సై తదితరులు

గోపాలపురం: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గోపాలపురం ఎస్సై కర్రి సతీష్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఎస్సై సతీష్‌కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఎంతో మంది విద్యావేత్తలుగా, ఉపాధ్యాయులుగా ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తు చేశారు. అనంతరం వారోత్సవాల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, దాత మద్దిపాటి గంగరాజు, జేష్ట శ్రీనివాసరావు, ఏఎస్సై కె.శోభనాద్రి, సీఆర్పీ కె.నాగరాజు, గ్రంథాలయ అధికారి వెజ్జు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయించవద్దు



కొవ్వూరులో రేషన్ బియ్యం ప్రాముఖ్యతను ప్రజలకు వివరిస్తున్న పౌర సరఫరాల అధికారులు

కొవ్వూరు: పౌర సరఫరాల వ్యవస్థ ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యాన్ని సద్వినియోగ పరుచుకోవాలని ఏఎస్‌వో నాగాంజనేయులు సూచించారు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో గురువారం రేషన్ బియ్యం వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. పీడీఎస్ ద్వారా అందించే బియ్యం ఎవరికి అమ్మవద్దని సూచించారు. రేషన్ బియ్యంలో అనేక పోషకాలుంటాయన్నారు. ఆ బియ్యం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. సీఎస్‌డీటీ సునీత, డీలర్ల సంఘం నాయకుడు కక్కిరాల సూరిబాబు, పలువురు రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి దుర్మరణం



దేవరపల్లిలో మృతి చెందిన త్యాజంపూడికి చెందిన యాదాల దిలీప్



యాదాల దిలీప్ (ఫైల్)

దేవరపల్లి: విద్యుదాఘాతానికి వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన యాదాల దిలీప్(32) ట్రాక్టర్‌పై ఎండుగడ్డి రవాణా చేస్తుంటాడు. గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో ట్రాక్టర్‌పై త్యాజంపూడి నుంచి దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని ఒక రైతుకు సంబంధించిన పొలానికి వరిగడ్డి రోల్స్ వేసుకుని వెళుతుండగా దారిలో వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాక్టర్‌పై ఉన్న దిలీప్ కొబ్బరి కమ్మతో తీగలను పైకి ఎత్తాడు. దీంతో కమ్మకు విద్యుత్ సరఫరా రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దిలీప్‌నకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పిల్లలు ముగ్గురు చిన్నవారే కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు, మున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్సై వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.